# పరిమళించిన మానవత్వం

-రేగులపాటి కిషన్‌రావు

నేను మా నియోజకవర్గంలో ఎం.ఎల్.ఏ.గా నిలబడి గెలుపొందాను. నేను మొట్టమొదటిసారి అసెంబ్లీ భవనంలో అడుగుపెట్టినప్పుడు పొందిన అనుభూతి వర్ణించడానికి నా మాటలు చాలవు. నేను రాజకీయ నాయకుడనే కాని కవిని కాదు గదా! నాకు కొంత కళా హృదయం ఉన్నమాట నిజం. సుతిమెత్తని మనస్తత్వం ఉన్నవాడనని చాలామంది అంటుంటారు.

కరీంనగర్‌లో పదవ తరగతి చదువుకుంటున్నప్పుడు మా పాఠశాల గురువులు ముఖ్యంగా సోషియల్ స్టడీస్ టీచర్ శంకరం మాస్టారు అంటుండేవారు. 'నువ్వు చదువు ముగించాక మంచి రాజకీయ నాయకుడవు కావాలి బాబూ! నువ్వు రాజకీయ నాయకుడవైతే చూచి ఆనందించాలని ఉంది. నువ్వు డాక్టర్‌వో, ఇంజనీరువో అయితే నువ్వు చేసే ప్రజాసేవ కంటే రాజకీయ నాయకుడవైతేనే బాగా చేయగలుగుతావు. పైగా నీకు పేదల పట్ల, వికలాంగుల పట్ల దయ ఉండడం నేను గమనిస్తూనే ఉన్నాను. నువ్వు ఉన్నవాళ్ల కుటుంబములో పుట్టినవాడవు కనుక నువ్వు అంతగా డబ్బు సంపాదించవలసిన అవసరం లేదు.

ఆనాడు శంకరం మాస్టారు అన్నమాటలు ఇప్పటికీ గుర్తున్నాయి. శంకరం మాస్టారును కలవక, మాట్లాడక చాలా కాలమయింది. ఎం.ఎల్.ఏ. అయ్యాక అతని వాక్కులు ఫలించాయని, అదే విషయం అతనితో చెప్పాలని, అతని ఆశీస్సులు పొందాలని మనసునిండా అనిపించింది.

నేను కొత్తగా కొనుక్కున్న మారుతి కారులో మాస్టారు ఇంటికి వెళ్లాను. ఇంటి ఆవరణలో ఒక వేపచెట్టు, తులసికోట, గులాబి చెట్లు ఉండడం గమనించాను. ఆ ప్లాటులో వెనుక గోడను ఆనుకొని రేకుల షెడ్డు ఉంది. ఆ షెడ్డు ముందు పది పన్నెండు మంది చుట్టూ గుమిగూడి ఉన్నారు.

ఇంతమంది ఇక్కడ ఎందుకు గుమిగూడి ఉన్నట్టు అనుకుంటూనే ఆ గుంపు దగ్గరకు వెళ్లాను. అందులో ఒకరిద్దరికి నేనెవరో తెలిసినట్టుంది. కాస్త పక్కకు జరిగి 'సమస్కారమండీ' అంటూ రెండు చేతులు జోడించి నమస్కరించారు. నేను ప్రతి నమస్కారం చేశానో లేదో అక్కడ శంకరం మాస్టారు శవం రూపంలో కనిపించారు. నా మనస్సులో ఉన్న ఆనందమంతా ఒక్కసారి గాలి తీసేసిన రబ్బరు బుడగలా అయింది. ఏమి ఆశించి వచ్చాను. ఇక్కడ జరిగిందేమిటి?

అక్కడ ఉన్న ఓ వృద్ధురాలు నా ముందుకు వచ్చి "అమ్మగారికి ఎవరూ లేరట. ఇంట్లో డబ్బు కూడా లేదట. భర్త చనిపోయినందుకు ఒకవైపు శవ దహనం చేసే ఆర్థిక స్థోమత లేదని మరోవైపు అమ్మగారు బాధపడుతున్నారు. కాదు కుమిలిపోతున్నారు. మీరు ప్రజానాయకులు ఆ అమ్మగారి కష్టాన్ని మీరే ఎలాగో గట్టెక్కించండి అంది. ఆమె పక్కింటామె అని విచారించగా తెలిసింది.

మదర్ థెరిస్సా, గాంధీ మహాత్ముడు, బుద్ధుడు, ఏసుక్రీస్తు మొదలగు మహాత్ములు నా మనస్సులోకి వచ్చి నేను ప్రజాసేవ ఎలా చేయాలో చెప్పినట్టే అనిపించింది.

నేను వెంటనే ఆ కాలనీకి దగ్గరలో ఉన్న, అదే కాలనీలో ఉన్న నాకు తెలిసిన వాళ్లకు ఫోన్ చేసి పిలిపించాను.

నేను శంకరం మాస్టారు ఇంటికి వచ్చిన అరగంట తర్వాత పెద్ద సంఖ్యలో జనం గుమిగూడారు. నా పార్టీ సభ్యులు అందులో ఎక్కువగా ఉన్నారు. నన్ను అభిమానించే పరియయస్థులు, కార్యకర్తలు చాలామంది వచ్చారు. నేను చెప్పినట్టే దహన సంస్కారానికి ఏర్పాట్లు

## 'వ్యయ' ప్రయాసం

స్వరాలు సవరించిన
కోయిలమ్మ పాటలలో
గుబాళింపుల పూల పల్లకిలో
వ్యయప్రయాసలకు
ఎదురీదుతూ
'వసంతం' మళ్ళీ వచ్చింది!
కవులంతా ఎదురు సన్నాహం పల్కండి
వున్నదున్నట్టు గళాలు విప్పండి
వాస్తవంగా కలాలు సవరించండి!

-జి. శైలూషి

జరిగాయి.

మాస్టారు శవం చూశాక, అమ్మగారు, పిల్లలు ఏడుస్తూ తమ బాధలను వెల్లడించాక నా మనస్సు మరింత దిగులుతో, బాధతో నిండిపోయింది. ఎప్పుడో కాని కన్నీళ్లు రాని నా కళ్లు కన్నీటితో నిండిపోయాయి. నా మనసుకు ఆ కుటుంబానికి ఏదో చేయాలని, ఆ కుటుంబాన్ని ఆదుకొని మాస్టారు ఋణం తీర్చుకోవాలని. ఇదే నిజమైన ప్రజాసేవ అని అనిపించింది. మాస్టారు శవం పాడెమీద పెట్టాక నేను ఆయన కాళ్లకు నమస్కరించాను. తర్వాత చాలామంది ఆయనకు నమస్కరించారని వేరే చెప్పనక్కరలేదు.

మాస్టారును వ్యానులో ఊరేగిస్తూ శ్మశానవాటికకు తీసుకువెళ్లాము. దహన సంస్కారం పూర్తయింది. మళ్లీ అదే వ్యానులో మాస్టారు ఇంటికి వచ్చి పిల్లలకు, అమ్మగారికి ధైర్యం చెప్పాను, ఊరడించాను. ఆర్థిక సాయం చేస్తానని హామీ ఇచ్చి అమ్మగారికి తోడుగా ఉండమని పక్కింటి విధవరాలికి చెప్పి వంద రూపాయలు ఆమె చేతిలో పెట్టబోయాను.

"వద్ద బాబూ ఉచితంగానే నాకు చేతనయిన సహాయం చేస్తాను. ఆర్థిక సహాయం చేసే శక్తి నాకు ఎలాగూ లేదు. కనీసం ఈ విధంగానైనా ఈ పంతులు గారి కుటుంబానికి సాయపడుతాను. మా ఆయన కాలం చేసినప్పుడు ఈ పంతులే దగ్గరుండి కావలసిన సాయం చేసి దహన సంస్కారం చేయించిన పుణ్యాత్ముడు. అడిగిన వాళ్లకు ఉన్నంతలో దానం చేసిన ఉత్తమ దాత. తన కోసం, తన కుటుంబం కోసం పెద్దగా ఏమీ మిగుల్చుకోలేకపోయాడు. రెండు సంవత్సరాల నుండి ఏదో మాయదారి రోగంతో బాధపడుతూనే ఉన్నాడు. ఉన్న డబ్బంతా అమ్మగారు పంతులు గారి వైద్యానికే ఖర్చు చేసింది. 'నా కోసం ఉన్న డబ్బంతా ఖర్చు పెడితే రేపు పిల్లల గతి ఏమిటే? నేను ఎలాగూ బతికే అవకాశం కనిపిస్తలేదు. ఆ ఉన్న డబ్బు పిల్లల కోసమే కాపాడు, అనేవాడు పంతులుగారు. కాని అమ్మగారు ఊర్కోలేదు. దవాఖాన్ల చుట్టు తిరిగి తిరిగి మందులు కొని కొని ఉన్న డబ్బు ఖర్చయ్యాక ఇక తిరగలేక ఊర్కుంది. వారం రోజుల నుండి అమ్మగారి కుటుంబం గడవడం కూడా కష్టంగానే ఉంది. ఇక అమ్మగారికి, పిల్లలకు మిగిలింది ఈ రెండు గుంటల భూమి, ఆ రేకుల షెడ్డు అంది.

నేను మళ్లీ రేపు వస్తానని అమ్మగారికి, పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూచుకొమ్మని చెప్పి విద్యానగర్‌లో ఉన్న మా ఇంటికి వచ్చేశాను.

మాది పన్నెండు పోర్షన్లు గల మూడంతస్థుల మేడ. పదహారు గుంటల భూమిలో రోడ్డు నానుకొని పదిహేను రూములు షెట్టర్లతో కట్టించి కిరాయకు ఇచ్చాను. మా ఇంటి మీద నెలకు యాభై వేలకు పైగానే అద్దె డబ్బులు

## నాలో సగం

**నా** కష్టాల్లో / కన్నీళ్ళు దరికి రాకుండా
తన చేపకళ్ళ రెప్పలతో ఓరచూపు చూసి
రెండు చేతులతో ఓ కాపుకాసి
ఓదార్పు మంత్రం పఠించి
కొండంత ధైర్యాన్నిచ్చే అండ.
నాలో లోనుంచి తొంగి చూచే
అహంకారపు తూటాని
తునాతునకలు చేసి
ప్రేమ బిందువుల్లాంటి
మంచి మాటల ముత్యాల్ని
నా మెడలో హారంగా వేసి
ముందుకు నడిపించే మార్గదర్శి.
నా కవితల కత్తిరింపులతో
సాహితీ వెన్నెల పరిచి / సీతాకోకలా ఎగిరి
కవిత్వాక్షరాలను పలకరించి
నా మెదడు పొరలకు అతికించి
సమాజంలోకి చొచ్చుకుపోయేదే
ఉత్తమ కవిత్వమంటూ
ధారణతో నన్ను పరుగెత్తించే
సంసార రథచక్రం.
పని ఒత్తిడిలో
నాచే అర్థాంతరంగా సృష్టించబడిన
టీ కప్పులో తుపానుపై / ఎప్పటికప్పుడు
చల్లని నీళ్ళు చిలకరిస్తుంటుంది. / అంతే-
నేను మంచుకొండలా కరిగిపోతాను.
మబ్బులు తొడుక్కున్న ఆకాశంలా
నాపై కురిపిస్తున్న ప్రేమతో
తడుస్తూ ముద్దవుతున్న నేను..
మా ముంగిట పండేవి
అనుభూతుల పంటలు..
మమకారం పంచి / పూట పూట
జీవశక్తి ముద్దలు తినిపించే
మా అబ్బాయికి / తల్లే ఆమె.

**-పి. ఆర్. ఎల్. స్వామి**

వస్తాయి. మా నాన్న లీడింగ్ లాయర్ కావడం వల్ల, ఎడతెగని కేసులు రావడం వల్ల, ఏ కేసులోనైనా నాన్న గారి వాదన గెలుస్తూ ఉండడం వల్ల నాలుగు తరాలకు తిన్నా తరగని డబ్బు సంపాదించి పెట్టిపోయాడు.

పన్నెండు రోజులు వరుసగా అమ్మగారి ఇంటికి వెళ్లి అవసరమైన సహాయం చేసి వచ్చాను. నెల రోజుల తర్వాత అమ్మగారి కుటుంబం మా ఇంటిలో ఒక పోర్షనులో ఉండేటట్టు ఏర్పాటు చేశాను. మాస్టారుకు ఇద్దరూ ఆడపిల్లలే. పెద్దమ్మాయి రమ పదవ తరగతి, చిన్నమ్మాయి విద్య తొమ్మిదవ తరగతి చదువుతున్నారు. వాళ్లు ఎంత చదువుకున్నా చదివిస్తానని అమ్మగారికి, పిల్లలకూ చెప్పేశాను.

ఆ ఇద్దరూ మొదట్లో ఒకటి రెండు రోజులు బాబుగారూ అంటూ సంబోధించారు. నేను అన్నాను, "మీరు నాకు చెల్లెల్ల లాంటివారు. లాంటివారు కాదు చెల్లెండ్రే. నన్ను మీరు అన్నయ్య అంటేనే నాకు ఎక్కువ ఆనందం." ఆనాటి నుంచి వాళ్లు నన్ను అన్నయ్య అనే పిలవసాగారు.

అమ్మాయిలిద్దరూ రూపంలోనే కాదు గుణంలో కూడ రత్నాల్లాంటి వాళ్లు. చదువులలో సరస్వతులే. క్లాసులోనే కాదు స్కూల్లో కూడా ఇద్దరూ అత్యున్నత మార్కులతో ఉండడం వాళ్ల మార్కుల పట్టికలు చూచి తెలుసుకున్నాను.

❍ ❍ ❍

రమ ఐఎఎస్ పాసై మా జిల్లాకే కలెక్టర్‌గా వచ్చింది. విద్యకు లెక్చరర్ ఉద్యోగం వచ్చింది. అంతే కాకుండా రచయిత్రిగా కథలు, కవితలు, వ్యాసాలు వ్రాస్తూనే ఉంది.

ఆమె రాసిన కథా సంకలనాన్ని నాకు ఇచ్చి చదవ మంది. ఆ కథలు చదివి చాలా ఆనందించాను. సామాజిక ఇతివృత్తాలతో చక్కని నీతిదాయకమైన కథలు అవి. చదువుతున్నంతసేపు నన్ను నేను మరచిపోయాను.

విద్య రాసిన కథా సంకలనం నాకు అంకితమిస్తా నంది. నేనన్నాను "చెల్లీ! ముందు నీ తల్లిదండ్రులకు మొదటి పుస్తకం అంకితం ఇవ్వు. తర్వాత మరో పుస్త కాన్ని నాకు అంకితం ఇద్దువుగాని.."

నా సూచన మేరకు విద్య మొదటి కథల పుస్తకం తల్లిదండ్రులకు అంకితం ఇచ్చింది. రెండవ పుస్తకం గేయ సంపుటి నాకు అంకితం ఇచ్చింది. అందులోని గేయాలన్ని కవితా పరిమళాలతో గుబాళిస్తున్నాయి. ఆ గేయాలు రేడియోలలోనూ, టీవీలలోనూ ప్రసారమైన విద్యకు రాష్ట్రస్థాయి గుర్తింపు రావడమే కాదు రాష్ట్రస్థాయి బహుమతులు కూడా వచ్చాయి.

రమ కలెక్టర్ హోదాలో కాకుండా అక్క హోదాలో పుస్తకం అంకితం, ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని సాహితీ సంస్థలన్నింటికీ లేఖలు, పత్రికల ద్వారా ఆహ్వానాలు పంపారు.

ఆ రోజు ఏర్పాటు చేసిన వేదికపైకి నన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. పుస్తకావిష్కరణ, అంకిత కార్యక్రమం, సన్మానం ఘనంగా నిర్వహించారు. నన్ను పూలమాలలతో ముంచెత్తారు. ప్రశంసల జల్లులు కురిపించారు. నన్ను దేవుడిని పొగిడారు. అదే సభలో అందరూ ఆశ్చర్యపోయేలా వారిద్దరూ ఒక ప్రకటన చేశారు.

కలెక్టర్ హోదాలో రమకు, లెక్చరర్ హోదాలో విద్యకు నెల నెలకు అందుతున్న వేతనాలలో ఇరవై అయిదు శాతం డబ్బు అనాథ బాలలకు ఉపయోగపడే విధంగా కేటాయిస్తూ ఉన్నత పాఠశాల నిర్వహిస్తామని చెప్పారు. అందుకోసం శంకరం ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

నేను ఇద్దరినీ పక్కకు పిలిచి "ఇంత పెద్ద ప్రకటన చేసే ముందు మీ అమ్మ గారిని సంప్రదించారా" అని అడిగారు.

"అమ్మనే ఇలా ప్రకటిస్తే బాగుంటుందని చెప్పింది మాకు. అమ్మ చెప్పిన విషయం మాకు నచ్చింది. అందుకే ఇలా ప్రకటించాము అన్నయ్యా! మీ ద్వారానే ఈ సహాయ గుణాన్ని మేము పెంచుకున్నాము" అన్నారు.

నిజానికి వాళ్లు చేసిన ప్రకటన ముందు, వాళ్ల త్యాగ గుణం ముందు నేను మాస్టారు కుటుంబ సభ్యులకు చేసిన సహాయం చాలా చిన్నదనిపించింది. ఈ చెల్లెళ్ల ఉన్నత గుణం ముందు నా సుగుణం కొండ ముందు బండలా అనిపించింది.

ఈ సోదరీమణులకు ఈ సహాయ సుగుణం నా వల్ల కాదు, మాస్టారు గారి ఉన్నత గుణం, అమ్మగారి ఉత్తమ గుణాల వల్ల వచ్చాయని నాకనిపించింది.

అమ్మగారి పేరు, మాస్టారు పేరు వచ్చేట్లు నా సూచన మేరకు "అపర్ణ శంకరం ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేస్తున్నామని" రమ, విద్యలు ప్రకటించారు.

అన్నట్టు నా సోదరీమణులకు తగిన వరులు దొరికారు. పెళ్లి ఏర్పాట్లు చేసి శుభలేఖలు అచ్చుకాగానే మీకు పంపిస్తాను. ■